ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

యాదాద్రి భువనగిరి

తెలుగు దినపత్రిక

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 128

శనివారం 9 నవంబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## శాంసన్ ధనాధన్

వరుసగా రెండో శతకం బాదిన సంజూ

రాణించిన తిలక్ వర్మ

స్పిన్నర్ల ధాటికి సఫారీలు విలవిల

తొలి టీ20లో భారత్ ఘనవిజయం



.. వివరాలు 7లో



04

ఎమ్మెల్యేల అనర్హతపై

## హైకోర్టులో విచారణ

విచారణ 11కు వాయిదా వేసిన కోర్టు



04

జస్టిస్ చంద్రచూడ్‌కు

## ఘనంగా వీడ్కోలు

10న పదవీవిరమణ చేయనున్న చీఫ్ జస్టిస్



04

సీఎం కోసం ఉంచిన

## సమోసాలు మాయం

సంఘటనపై విచారణ





బుల్డోజర్లు ఎక్కించైనా

# మూసీ ప్రక్షాళన

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని

చూసేవారు కుక్కచావు చస్తారు

మూసీ కాలుష్యం అణుబాంబు కంటే ప్రమాదం

ప్రక్షాళన చేయకపోతే నా జన్మ దండగ

నకిలీ బీజేపీ నేతలవి అవాకులు.. చవాకులు

మోదీ చేస్తే మెచ్చుకుంటారు.. మేం చేస్తే తప్పా?

బిడ్డ జైలుకెళ్తే దుఃఖించావు.. మా బిడ్డల బాధలు పట్టవా కేసీఆర్?.. ఈ పాదయాత్ర ట్రైలరే

అసలు సినిమా ముందుంది: సీఎం రేవంత్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా సంగెంలో మూసీ బాట

యాదాద్రి, (రోమింగ్ న్యూస్) : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ



## ఇక యాదాద్రి కాదు.. యాదగిరిగుట్టనే

టిటిడి తరహాలో యాదగిరిగుట్ట బోర్డు

అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ

స్వామిని దర్శించుకున్న సిఎం రేవంత్ రెడ్డి

.. వివరాలు 2లో

కూల్చిన ఇండ్లెక్కడ

## తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ

మోకాలికి దెబ్బ తగిలితే.. బోడి గుండుకు కుట్లు వేసినట్లు గుంపు మేస్త్రీ పాలన

నీ మూసీ దాహానికి అత్తాపూర్ ఆగం..ఆగం

గోల్నాక గొల్లుమంది.. దిలుసుఖ్‌నగర్ ఢీలా పడ్డది

ఎక్స్ వేదికగా రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం



హైదరాబాద్ (రోమింగ్ న్యూస్) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ యాత్రపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు గుంపు మేస్త్రీ పాలన తీరు ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లో మూసీ బాధితులు ఉంటే.. నల్లగొండలో మూసీ పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటని

మిగతా 2 లో



## మండిపోతున్న వంటనూనెలు

రోజురోజుకూ పెరుగుదల

దిగుమతి సుంకాన్ని పెంచిన కేంద్రం

.. వివరాలు 4లో

## ప్రభుత్వ పాలన తీరు మారడం లేదు

గురుకులాల్లో పరిస్థితి మరీ అధ్వానం : మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, (రోమింగ్ న్యూస్) : గురుకులాల్లో వం-ˆసస ఫుడ్ పాయిజన్ ఘటనల పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నా, ప్రభుత్వ తీరు మారడం లేదని.. గురుకుల విద్యార్థుల కష్టాలు తీరడం లేదని అన్నారు. ఇప్పటికీ అదే నిర్లక్ష్యం, అదే అలసత్వం

మిగతా 2 లో



## కేటీఆర్‌కు మతి భ్రమించింది

అందుకే ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నాడు

మరోమారు మండిపడ్డ మంత్రి పొంగులేటి

పచ్చకామెర్లు వచ్చినోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు.. కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నాడని.. బాధ్యతాయుతమైన హోదాలో ఉన్న తమకు అతడి ప్రతి మాటకు స్పందిచాల్సిన అవసరం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి మరోసారి ఫైర్ అయ్యారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లాలో మాట్లాడారు


ఖమ్మం (రోమింగ్ న్యూస్) : గత బీఆర్ఎస్ లాగా తొండాట ఆడాలనే ఉద్దేశ్యం ఇందిరమ్మ ప్రభుత్వానికి లేదని అన్నారు. అమృత్ టెండర్లలో ఒక్క రూపాయి వర్క్ రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు లేవని.. ఉంటే నిరూపించాలని కేటీఆర్‌కు ఛాలెంజ్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తోన్న కేటీఆర్‌కి

మిగతా 2 లో

## కేటీఆర్‌తో రేవంత్ కాంప్రమైజ్

ములాకత్ రాజకీయాలతో రేవంత్ బిజీ : బండి సంజయ్

హైదరాబాద్, నవంబర్ 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, రేవంత్ కాంప్రమైజ్ అయ్యారని.. అందుకే మొన్నటి జన్వాడా కేసును గాలికి వదిలేశారంటూ విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌తో కేటీఆర్ ములాకత్ రాజకీయాలు నడిపిస్తున్నారని.. తెలంగాణలో యాక్టివ్ సీఎం కేటీఆర్ అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు.



04

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 9 నవంబర్ 2024




# బుల్డోజర్లు ఎక్కించైనా మూసీ ప్రక్షాళన

మొదటి పేజీ తరువాయి

దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం వద్ద మూసీ పునరుజ్జీవ యాత్రను సీఎం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమీషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు. "రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ.25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారు.

మీలాగా కాళేశ్వరం నిర్మించి రూ.లక్ష కోట్లు దోచుకోలేదు. డబ్బులు సంపాదించాలనుకుంటే కేసీఆర్ తెచ్చిన ధరణితో కోకాపేటలో 500 ఎకరాల్లో తప్పిదాలు చేస్తే.. రూ.50 వేల కోట్లు వస్తాయి. రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల ప్రజల ప్రయోజనాల కోసం మూసీ ప్రక్షాళనకు పూనుకున్నాం. బీఆర్ఎసకు దోచుకోవడం తప్ప మేలు చేయడం తెలియదు. అందుకే మూసీ పునరుజ్జీవాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారు" అని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళనకు అండగా ఉంటానని చెప్పిన కమ్యూనిస్టు సోదరులకు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఒకనాడు మంచినీటిని అందించిన మూసీనది ప్రస్తుతం మురికికూపంగా మారి విషాన్ని చిమ్ముతోందని సీఎం రేవంత్ అన్నారు. పాలకులు పగబట్టారా? దేవుడు శాపం పెట్టాడా? అన్న పరిస్థితితో మూసీ పరివాహక ప్రాంత ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కులవృత్తులు చేసుకునే పరిస్థితి లేదని, ఇక్కడ పండిన పంటలు తినేలా లేవని, ఇక్కడ పశువుల పాలు తాగాలన్నా ఆలోచించాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ఎంతో సంతోషంగా బతికిన ఇక్కడి ప్రజలు.. ప్రస్తుతం భూములు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.



"3నెలలపాటు మీ కుమార్తె జైలుకు పోతేనే దుఃఖం వచ్చింది. మూసీ పరివాహక ప్రాంత బిడ్డల జీవితాలు పోతుంటే మీకు పట్టదా? మా బిడ్డలు కాళ్లు, నడుము వంకర్లతో పుడితే వాళ్లను ఇంట్లోనే ఉంచి తల్లులు పనికి వెళ్తున్నారు. ఆ బిడ్డల బాధ పట్టదా? నల్లగొండ జిల్లా ప్రజలు మీకు ఓట్లు వేయలేదని మూసీ ప్రక్షాళనను అడ్డుకోవాలని చూస్తున్నావా కేసీఆర్? నల్లగొండ పౌరుషాల గడ్డ. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే మూసీలోనే పాతరేస్తారు" అని రేవంత్ అన్నారు.

**జన్మ ధన్యమైంది..**

"ఇది జన్మదినం కాదు.. ఇక్కడికి రావడంతో నా జన్మ ధన్యమైంది. సంగెం శివయ్యను దర్శించుకుని సంకల్పం తీసుకున్నాను. మూసీ ప్రక్షాళన చేసి తీరతాం. నేటి పాదయాత్ర ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా 2025 జనవరిలో ఉంది. వాడపల్లి నుంచి హైదరాబాద్ చార్మినార్ వరకు లక్షలాది మందితో కదం తొక్కుతాం. బిల్లా, రంగా (కేటీఆర్, హరీశ్‌రావు)లకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే నాతోపాటు పాదయాత్ర చేపట్టాలి.. ఈ ప్రాంతానికి రావాలి. ఇక్కడి ప్రజలు మిమ్మల్ని రానిస్తారో, నడుముకు తాడుకట్టి మూసీలో ముంచేస్తారో చూద్దాం" అంటూ సీఎం ఘాటు వ్యాఖ్యలు చేశారు. రూ.2 కోట్లతో భీమలింగం శివన్న దర్శనానికి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి మంది ప్రజలకు ఇబ్బందిగా మారిన మూసీ ప్రక్షాళనకు పార్టీలు రాజకీయాలకతీతంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళన చేపడితే బుల్డోజర్లకు అడ్డంగా పడుకొని ఆపుతామని కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎవరు అడ్డొచ్చినా బుల్డోజర్లతో తొక్కుకుంటూ మూసీ ప్రక్షాళనను ముందుకు తీసుకెళ్తామని ప్రకటించారు. తనను జైలులో పెడితే యోగా చేసి స్లిమ్‌గా తయారై బయటికి వస్తానంటూ కేటీఆర్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.

**సీఎం యాత్ర సాగిందిలా..**

సీఎం రేవంత్‌రెడ్డి.. మూసీ పునరుజ్జీవ పాదయాత్రను యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం బ్రిడ్జి వద్ద చేపట్టారు. సాయంత్రం 3.30 గంటలకు సంగెం వద్దకు చేరుకున్న సీఎం.. తొలుత మూసీనది ఒడ్డున ఉన్న భీమలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. శివలింగాన్ని గుండెలకు హత్తుకున్నారు. అక్కడే ప్రజాప్రతినిధులు, అధికారులతో భీమలింగం అభివృద్ధికి సంబంధించి చర్చించారు. అనంతరం ఎన్‌డీఆర్ఐ బృందానికి చెందిన బోటు ఎక్కి మూసీలో కొద్దిదూరం ప్రయాణించి నదిలోని నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడారు. మూసీ కాలుష్యం కారణంగా కులవృత్తులవారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రైతులతో చర్చించారు. కాగా, ఈ ప్రాంతంలో పండిన పంటలను కొనుగోలు చేయడంలేదని రైతులు సీఎంతో చెప్పారు. మూసీ ప్రక్షాళనతోనే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. 4.09 నిమిషాలకు సీఎం రేవంత్‌రెడ్డి భీమలింగం కత్వ నుంచి మూసీ పునరుజ్జీవ యాత్ర చేపట్టారు. యాత్ర రెండున్నర కిలోమీటర్లు కొనసాగి 4.43 గంటలకు ముగిసింది. యాత్ర ముగిసిన ప్రదేశంలోనే ప్రధాన రహదారిపై ముఖ్యమంత్రి ప్రత్యేక రథం ఎక్కి మాట్లాడారు.

**బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతల అరెస్టు**

నల్లగొండ: యాదాద్రి భువనగిరి జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించడంతో శుక్రవారం నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఆ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ఆయన నివాసంలో హౌస్ అరెస్టు చేశారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద అరెస్టుచేసి మునుగోడు పోలీసస్టేషన్‌కు తరలించారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గృహనిర్బంధం చేశారు.

# ఇక యాదాద్రి కాదు..యాదగిరిగుట్టనే

యాదగిరిగుట్ట,నవంబర్8 : ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా వ్యవహారం లోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు మర్యాదలతో స్వాగతించారు. పూర్ణకుంభ స్వాగతంతో అర్చకులు స్వాగతించారు. అనంతరం స్వామి పూజలో పాల్గొన్నారు. అనంతరం స్వామి తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు. తరవాత ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షలో సీఎం పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. టెంపుల్ బోర్డు ఏర్పాటు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట బోర్డుకు తితిదే స్థాయిలో ప్రాధాన్యత ఉండేలా అధ్యయనం చేసి టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. గోశాలలో గోసంరక్షణకు ప్రత్యేక పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. గోసంరక్షణకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులను పూర్తి



చేయాలని చెప్పారు. అందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాల్సిందేనని అధికారులకు తేల్చి చెప్పారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రతిపాదనలతో రావాలని ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి నివేదిక అందించాలన్నారు. మొత్తంగా యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అధికారులకు స్పష్టం చేశారు. బ్రహ్మోత్సవాల నాటికి బంగారు తాపడం పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆలయ అభివృద్ధికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఇందుకు అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మరో వారం రోజుల్లో పూర్తి వివరాలు, ప్రపోజల్స్‌తో రావాలని అదేశించారు. ఆలయానికి సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పెండింగ్ పనులు, ఇతర అంశాలపై పూర్తిస్థాయి రిపోర్ట్ అందించాలని అన్నారు. ఇకనుంచి యాదాద్రి బదులుగా అన్ని రికార్డుల్లో యాదగిరిగుట్టగా వ్యవహారికంలోకి తీసుకురావాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. అంతకుముందు యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ఈవో భాస్కరరావు మంత్రులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నేడు యాదాద్రికి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు స్వాగతం పలికేందుకు ముందస్తుగా మంత్రులు అక్కడికి చేరుకున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లను వారు పరిశీలించారు.





# కూల్చిన ఇండ్లెక్కడ

## తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ

మొదటి పేజీ తరువాయి



ప్రశ్నించారు. కూల్చిన ఇండ్లెక్కడ, కాలిన కడుపులెక్కడ, నువ్ తిరుగుతున్న ప్రాంతం ఎక్కడ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నీ మూసీ దాహానికి అత్తాపూర్ ఆగమైందని, గోల్నాక గొల్లుమంటుందని, దిలుషుక్ నగర్ ఢీలా పడిందన్నారు. నీ కుట్రలకు అంబర్ పేట్, అత్తాపూర్ అతలాకుతలం అవుతుంటే.. నీ పుట్టినరోజు వేడుకలు జరుగుతున్నది ఎక్కడని ప్రశ్నించారు. అయ్యా సంబరాల రాం బాబు.. నీ అన్యాయానికి ఆవేధనలు, ఆవేశాలు, ఆక్రందనలు వినిపిస్తున్నవి, కనిపిస్తున్నవి అక్కడ కాదు.. రా ఇటు వైపు రా ఇక్కడ చెయ్యి నీ పాదాల మీద యాత్ర అంటూ ఎక్స్ వేదికగా విమర్శించారు. తేలు మంత్రం రానోడు పాము కాటుకు మంత్రం ఏసినట్లు.. పాలన తెల్వని నీకు పగ్గాలు అప్పగిస్తే ప్రజల బతుకుల్ల మన్ను పోసినవ్ అంటూ మండిపడ్డారు.

"మోకాలికి దెబ్బ తగిలితే బోడి గుండుకు కుట్లు వేసినట్టు ఉంది గుంపు మేస్త్రీ పాలన తీరు హైదరాబాద్ లో మూసి బాధితులు ఉంటే-నల్గొండలో మూసి పరివాహక ప్రాంత రైతులను కలవడంలో రేవంత్ రెడ్డి ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు.

సీఎం రేవంత్‌కు కేటీఆర్ జన్మదినోత్సవ శుభాకాంక్షలు

సీఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తాను హైదరాబాద్‌లోనే ఉన్నానని, మీ ప్రభుత్వ ఏజెన్సీలు ఎప్పుడైనా రావచ్చంటూ ట్వీట్ చేశారు. విచారణకు వచ్చిన సిబ్బందికి చాయ్, ఉస్మానియా బిస్కెట్లు ఇస్తానని తెలిపారు. వారు కోరితే మీ బర్త్‌డే కేక్ కూడా కట్‌చేయిస్తానని చెప్పారు. కాగా, అరెస్టు భయంతో కేటీఆర్ మలేషియా వెళ్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ న్యూస్‌పేపర్ రాసుకొచ్చిందని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ చేసిన ట్వీట్‌ను ఆయన కేటీఆర్ ట్యాగ్ చేశారు. కేటీఆర్ ప్రతిష్ఠను మసకబార్చేందుకు ఇదంతా చేస్తున్నారని మాకు తెలుసని, జర్నలిజాన్ని జోక్‌గా మార్చవద్దంటూ క్రిషాంక్ అందులో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో చాయ్ తాగుతూ ఈ వార్తను చదువుతూ ఉంటారని చెప్పారు.

# ప్రభుత్వ పాలన తీరు మారడం లేదు

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ పాయిజనింగ్ వల్ల మంచిర్యాల గిరిజన గురుకులంలో 12 మంది విద్యార్థినులు ఆసుపత్రి పాలైన ఘటన గడిచి 24 గంటలు కూడా కాకముందే, మరోసారి వాంతులు, కడుపునొప్పితో విద్యార్థులు ఆసుపత్రికి చేరుకున్న పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు. ఫుడ్ పాయిజన్ అయిన విద్యార్థులకు సరైన వైద్యం అందించలేని దుర్మార్గ దుస్థితికి ఈ ప్రభుత్వం చేరుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాడి తప్పిన పాలనకు వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. నిర్మల్, వాంకిడి, మంచిర్యాల గురుకులాల్లో ఇప్పటి వరకు మొత్తం 94 మంది ఆసుపత్రుల పాలవ్వగా, ఇంద్రవెల్లి, నిర్మల్ గురుకులాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జ్వరంతో ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాంకిడి గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థుల పరిస్థితి ఇంకా అలాగే ఉందని.. అయినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదని మండిపడ్డారు. మొద్దు నిద్ర వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేను పోను బిడ్డో సర్కారు దవాఖానకు అనేది ఏండ్ల నుంచి వస్తున్న కాంగ్రెస్ పాలన మార్క్ అయితే, ఇప్పుడు నేను పోను బిడ్డో గురుకుల పాఠశాలకు అనేది కాంగ్రెస్ సర్కారు నయా మార్క్ గా మారిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆసుపత్రి పాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, పతనమవుతున్న గురుకులాలపై సమీక్ష నిర్వహించాలని, ఫుడ్ పాయిజన్ కేసులు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కేటీఆర్‌కు మతి భ్రమించింది

మొదటి పేజీ తరువాయి



సిగ్గుండాలని ఘాటు విమర్శలు చేశారు. కేబినెట్ మంత్రికి ఎలాంటి పవర్స్ ఉంటాయో తెలియని కేటీఆర్ పదేళ్లు ఎలా పని చేసాడో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో తప్పు చేసిన ఎవరినైనా వదిలిపెట్టమని.. చిన్న దొరనైనా, పెద్దదొరనైనా వదిలిపెట్టమని హెచ్చరించా రు. మేఘా కృష్ణా రెడ్డి కంపెనీ లేదా ఇంకొక కంపెనీకి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఏ విధంగా రెడ్ కార్పెట్ వేశారో.. తెలంగాణ , దేశ వ్యాప్తంగా ప్రజలంతా గమనించారని.. ఆ వ్యాపారాలు చేసే సంస్థలు గమనించా యన్నారు. ఏ కంపెనీనైనా బ్లాక్ లిస్టులో పెట్టేందుకు అర్హులైతే ప్రభుత్వం తప్పకుండా బ్లాక్ లిస్టులో పెడుతుందని స్పష్టం చేశారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫీట్ అనే క్లాజ్ తెలుసు, చట్టం ఏంటో తెలుసు.. అంత అమాయకంగా ఇక్కడ ఎవ్వరు లేరని.. తనతో సహా చట్టం విషయంలో ఎవరికి చుట్టాలు ఉండరని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడు పెట్టని విధంగా.. ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు కోసం రూ.72 వేల కోట్ల బడ్జెట్ పెట్టామని గుర్తు చేశారు. గత పదేళ్లు రాచరిక పరిపాలన చేసిన పెద్దలు.. అది పీకుతాం, ఇది పీకుతాం ప్రభుత్వాన్ని కూలుస్తాం అంటు ప్రగల్భాలు పలుకుతున్నారని ఘాటు విమర్శలు చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కక్ష్య పూరిత రాజకీయాలు చేయమని చెప్పారు. రాష్ట్రంలో ఏ రైతుకు ఇబ్బంది లేకుండా పంట మొత్తం కోనుగోలు చేయడంలో ప్రభుత్వం ఒక్క అడుగు కూడా వెనక్కి వేయబోదని అన్నారు. గత పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ చేయలేనిది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. ప్రతిపక్షాలు మంచి సూచనలు చేస్తే ప్రభుత్వం స్వీకరించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం 9
నవంబర్
2024





# మండిపోతున్న వంటనూనెలు

రోజురోజుకూ పెరుగుదల

దిగుమతి సుంకాన్ని పెంచిన కేంద్రం



హైదరాబాద్, నవంబర్ 8 : వంటనూనెల ధరలు మంటలు మండి పోతున్నాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ వినియోగదారులకు దడ పుట్టిస్తున్నాయి. పండుగలు, శుభకార్యాల వేళ వంట నూనెల ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. గత నెల క్రితం లీటరు పామాయిల్ రూ.90లు నుంచి రూ.95లకు, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ. 110-115 లకు ఉండగా ప్రసుత్తం పామాయిల్ రిటైల్ మార్కెట్‌లో లీటర్ రూ. 135లకు, సన్‌ఫ్లవర్ రూ.145 లకు చేరింది. అంతేకాకుండా మన దేశీయ అవసరాలకు పామాయిల్, సన్‌ఫ్లవర్ నూనెలను ఎక్కువ మొత్తంలో దిగుమతి చేసుకుంటున్న సంగతి విదితమే. ఈ క్రమంలో దేశీయంగా పామాయిల్ ధరలు, సాగు పెంచేందుకు గాను ఇటీవల కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఒకేసారి 20 శాతం పెంచింది. దీంతో ఒక్క సారిగా వంట నూనెల ధరలు భగ్గుమన్నాయి. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ నూనె లీటర్ ధర రూ. 150 నుంచి రూ. 160 ల వరకు, రైస్ బ్రాన్ ఆయిల్ లీటర్ రూ.150ల నుంచి రూ.160ల వరకు, మస్టర్డ్ ఆయిల్ (ఆవనూనె) రూ.200 ల నుంచి రూ. 210 ల వరకు, పూజలకు ఉపయోగించే దీపారాదన నువ్వుల నూనె సైతం లీటర్ రూ.150ల వరకు పెరిగాయి. అంతే కాకుండా 15 లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్ టిన్ ధర గత నెలలో రూ. 1,750 లు కాగా ప్రస్తుతం రూ. 2,250 లకు చేరింది. ప్రాంతాలను బట్టి రిటైల్ మార్కెట్‌లో లీటర్‌కు మరో రూ.5 లు అధనంగా భారం పడుతుండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ప్రస్తుతం పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో నూనెలపై ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు భయపడుతున్నారు. డిమాండ్‌కు అనుగుణంగా మన దేశీయ అవసరాలకు ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకోవడంతో ధరల పెరుగుదల నమోదవుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. మన దేశంలో వంట నూనె గింజల ఉత్పతి కేవలం 5 శాతమేనని, విదేశాలనుంచి దిగుమతి మిగితా 95 శాతం దిగుమతి ఉండటంతో పాటు దిగుమతి సుంకాలు, లోకల్ రవాణా చార్జీలు, జీఎస్టీ, వ్యాపారుల కమీషన్, రిటైలర్ లాభాల మార్జిన్‌లు అధనంగా ఉండటంతో ధరలు పెరుగుదలకు కారణాలని వ్యాపారులు పేర్కొంటున్నారు.

### నూనె గింజలు, పామాయిల్ పంటల సాగును సబ్సిడీతో ప్రోత్సహించాలి

మన దేశం 95 శాతం వంట నూనెలను విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. కారణం మనదేశంలో రైతులు నూనె గింజలను పండించకుండా పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలను మాత్రమే పండిస్తున్నారు. నూనె గింజలకు మద్ధతు ధర ఎక్కువగా నిర్ణయించి, రైతులకు విత్తనాలను, ఎరువులను సబ్సీడీపై అందించి నూనె గింజలు, పామాయిల్ సాగును ప్రోత్సహిస్తే ధరలు ఇక్కడ తగ్గే అవకాశం ఉంటుంది. లేకపోతే నూనెల ధరలను నియంత్రించ లేము. నూనెలను విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నంత కాలం పరిస్థితి ఇలానే ఉంటుంది. ప్రభుత్వాలు ఇకనైనా నూనె గింజల సాగుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలి.

# కేటీఆర్‌తో రేవంత్ కాంప్రమైజ్



హైదరాబాద్, నవంబర్ 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, రేవంత్ కాంప్రమైజ్ అయ్యారని.. అందుకే మొన్నటి జన్వాడా కేసును గాలికి వదిలేశారంటూ విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ.. రేవంత్‌తో కేటీఆర్ ములాకత్ రాజకీయాలు నడిపిస్తున్నారని.. తెలంగాణలో యాక్టివ్ సీఎం కేటీఆర్ అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటై బీజేపీని మీడియాలో లేకుండా చూస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీలో ఆ పార్టీ గురించి ఆలోచించే వారెవరూ లేరన్నారు. కాంగ్రెస్‌ను గద్దె దింపే దమ్ము బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటారో పోతారో అనే భయం కేటీఆర్‌కు ఉందన్నారు. ప్రజా సమస్యల మీద కేసీఆర్ స్పందించడం లేదని.. కేటీఆర్ బామ్మర్ది అరెస్ట్ అయితే అధికారులకు ఫోన్ చేస్తారా అంటూ మండిపడ్డారు. కేటీఆర్ బామ్మర్ది మీద కేసు అయితే ఎమ్మెల్యేలు అంతా వెళ్తారని.. కానీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసు నమోదు అయితే మాత్రం వారిని పరామర్శించరన్నారు. అభ్యర్ధి లేదు కాబట్టే ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ దూరంగా ఉంటుందంటూ వ్యాఖ్యలు చేశారు. సర్పంచ్‌లు, ఆటో వాళ్ల పొట్ట కొట్టింది బీఆర్ఎస్సే అని.. మళ్ళీ వీరే వారి పట్ల సానుభూతి చెప్పేందుకు వెళ్తే వారు నమ్ముతారా అని నిలదీశారు. అందుకే కేటీఆర్‌ను అడ్డుకుంటున్నారన్నారు. ఆందోళనకారులు కూడా ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ వాళ్ళను ఉద్యమాలకు పిలిస్తే మీరే నష్టపోతారన్నారు. బీఆర్ఎస్‌లో హరీష్ రావు ఎంతో కొంత క్రిడిబులిటీ కలిగిన నాయకులని.. అయితే కేటీఆర్ అహంకారి అంటూ వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ తమాషాలు మానేయాలని హితవుపలికారు. ప్రధాని గురించి కూడా ఏకవచనంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్రమంగా సంపాదించిన డబ్బు వల్లే అహంకారం పెరిగిందని.. ఆయన కళ్ళు నెత్తికెక్కాయంటూ విరుచుకుపడ్డారు. బండి సంజయ్, రేవంత్ ఒక్కటేనని సోషల్ మీడియా ద్వారా కేటీఆర్ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. " కేటీఆర్ గత చరిత్ర ఏంటి.. గతంలో నీవు మీ నాన్న చేసిన వ్యాపారం ఏంటి. ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి. కేటీఆర్‌కు రాజ్‌భవన్ అంటే గౌరవం లేదు. కేటీఆర్ ఆయనకి ఆయనే మలేసియా పారిపోయాడు అని ప్రచారం చేసుకున్నాడు. నీవు మలేషియా పారిపోయావ్ అనేది ఎంత నిజమో... రాజ్‌భవన్ వేదికగా నీ మీద కుట్ర జరిగింది అనేది అంతే నిజం అయ్యి ఉండొచ్చు. బీజేపీలోకి హరీష్ రావు వస్తానంటే తీసుకోవడం ... నా ఒక్కడి నిర్ణయం కాదు. మాది ఏక్ నిరంజన్ పార్టీ కాదు ... పార్టీలో అంతా కలిసి నిర్ణయం తీసుకోవాలి" అంటూ బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టులో విచారణ

### విచారణ 11కు వాయిదా వేసిన కోర్టు




హైదరాబాద్,నవంబర్ 8 : తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించిన కేసులో హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. అనంతరం కేసు విచారణను 11వ తేదీకి వాయిదా వేవారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌పై సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస తరఫున సీనియర్ న్యాయవాది మోహన్‌రావు వాదనలు వినిపించారు. సింగిల్ జడ్జి తీర్పుపై అప్పీల్ చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదన్నారు. అసెంబ్లీ కార్యదర్శి దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత లేదన్నారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ మేరకు పలు కోర్టుల తీర్పులను మోహన్‌రావు చదివి వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను 11వ తేదీకి వాయిదా వేసింది.

# కంపెనీలా ట్రిబ్యునల్‌లో సరస్వతీ పవర్ కేసు

### విచారణను ఎన్‌సీఎల్‌టీ డిసెంబర్ 13వ తేదీకి వాయిదా

హైదరాబాద్, నవంబర్ 8 : హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్‌లో సరస్వతీ పవర్ కేసుకు సంబంధించి జగన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయడానికి విజయమ్మ, షర్మిల తరపు న్యాయవాది సమయం కోరారు. విచారణను ఎన్‌సీఎల్‌టీ డిసెంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది. సరస్వతీ పవర్ కంపెనీలో షేర్ల బదిలీపై జగన్ ఎన్‌సీఎల్‌టీలో ఇటీవల పిటిషన్ వేశారు. తనకు తెలియ కుండా తల్లి, సోదరి అక్రమంగా షేర్లు బదిలీ చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. విజయమ్మ, షర్మిల, జనార్ధన్‌రెడ్డిని ప్రతివాదులుగా చేర్చారు. షేర్ల బదిలీ ఫారాలు, ఇతర డాక్యుమెంట్లు ఏమీ సమర్పించ కుండానే తమ పేర్ల మీదకు మార్చుకున్నారని జగన్ చెప్పారు. జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ పేరిట షేర్లు కొనసాగేలా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. 51.01 శాతం షేర్లను యథావిధిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# సీఎం కోసం ఉంచిన సమోసాలు మాయం

## సంఘటనపై విచారణ

సిమ్లా, నవంబర్ 8 : అక్టోబర్ 21న సీఐడీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐడీ అధికారులతో కలిసి ఆయన టీ తాగారు. అయితే సీఎంకు సర్వ్ చేసేందుకు ప్రత్యేకంగా ఉంచిన మూడు బాక్సుల సమోసాలు మాయమయ్యాయి. దీంతో సీఐడీ అధికారులు గందరగోళానికి గురయ్యారు. కాగా, సీఐడీ కార్యాలయంలోని మహిళా అధికారిణి ఆ సమోసాల బాక్సులను సీఎం భద్రతా సిబ్బందికి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో సీఎం కోసం ఉంచిన ఆ సమోసాలు వారు తిన్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సీఐడీ అంతర్గత దర్యాప్తు జరుపుతోంది. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లో ప్రతిపక్షమైన బీజేపీ దీనిపై విమర్శలు గుప్పించింది. సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు కోసం ఉంచిన సమోసాలు మాయం కావడంపై సీడీఐ దర్యాప్తు చేస్తున్నట్లుగా సోషల్ మీడియాలో ఆరోపించింది. అయితే సీఐడీ దీనిని ఖండించింది. కేవలం అంతర్గతంగా ఆరా తీసినట్లు సీఐడీ డీజీ తెలిపారు. సీఎంవో కార్యాలయం కూడా ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టింది. బీజేపీకి ఏ సమస్యలు కనిపించకపోవడంతో ఈ అంశంపై తప్పుడు ప్రచారం చేస్తున్నదని మీడియా ప్రధాన సలహాదారుడు నరేష్ చౌహాన్ విమర్శించారు.

# జస్టిస్ చంద్రచూడ్‌కు ఘనంగా వీడ్కోలు

### 10న పదవీవిరమణ చేయనున్న చీఫ్ జస్టిస్



న్యూఢిల్లీ,నవంబర్ 8 : భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఆయనకు చివరి పనిదినం కావడంతో సుప్రీం ధర్మాసనం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవమని.. అయినప్పటికీ తాను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నానని చెప్పారు.మరోవైపు సుప్రీం కోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులలైన సంగతి తెలిసిందే. నవంబర్ 11న జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఇదివరకే వెల్లడించారు. 2025 మే 13 వరకు ఆయన సీజేఐగా కొనసాగనున్నారు.

# కేఏపాల్ పిటిషన్ డిస్మిస్

అమరావతి, నవంబర్ 8 : తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం ఉదయం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కేఏ పాల్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తిరుమల దేవాలయాల నిర్వహణ పాలకమండలి చేతిలో కాకుండా పూజారుల చేతుల్లో ఉంచాలని ఆ పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు. కేవలం 744 మంది కేథలిక్‌లు ఉన్న వాటికన్ సిటీని ప్రత్యేక ప్రాంతంగా గుర్తించారని.. అలాగే లక్షలాది మంది భక్తులకు ప్రాధాన్యత ఉన్న తిరుపతి కూడా అదేవిధంగా ప్రత్యేక ప్రాంతంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల దేవాలయానికి వచ్చే వేల కోట్ల ఆదాయం దుర్వినియోగం అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, సీబీఐ, డీజీపీలను కేఏ పాల్ ప్రతివాదులుగా చేరుస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

# బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు







భువనగిరి, నవంబర్ 8 : ముఖ్యమంత్రిని అడ్డుకుంటారనే అనుమానంతో బీబీనగర్, వలిగొండ, యాదగిరిగుట్ట, ఆలేరు, చిట్యాల మండలాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిని ఆలేరులో హౌస్ అరెస్టు చేశారు. చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అదుపులోకి తీసుకున్నారు. మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. వలిగొండ, సంగెంలో వందలాది మంది పోలీసులను మోహరించారు. కాగా, పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ ఖండించింది. నాయకులు, కార్యకర్తలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గాన్ని వదిలి, హెలికాప్టర్‌లో పాదయాత్రకు సిద్ధమయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం గ్రామం నుంచి పాదయాత్రగా బయలుదేరి భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించే విధంగా రూట్‌మ్యాప్‌ను రూపొందించారు. పాదయాత్ర మార్గమధ్యంలో ఆయనకు ఎవరెవరు వంగి దండాలు పెట్టాలి, మెడలో ఎవరు దండలు వేయాలి, హారతులు ఎవరు పట్టాలి, పార్టీ కార్యకర్తల గుంపులు ఎక్కడెక్కడ నిలబడి జై కొట్టాలి.. అనే అంశాలపై ముందస్తుగానే పకడ్బందీ ప్లాన్ చేశారు. ఎంపిక చేసిన రైతులు మాత్రమే ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు వీలుగా సమావేశ స్థలాన్ని సిద్ధంచేసి పెట్టినట్టు తెలసింది. రైతు సమావేశంలో సీఎంను ఏఏ ప్రశ్నలు అడగాలనే దాని మీద ఓ ఎంపీ సమక్షంలో ఇప్పటికే వారికి శిక్షణ ఇచ్చినట్టు తెలుస్తున్నది. పతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టడానికి మూసీ పరీవాహక ప్రాంతం వెంట పాదయాత్ర చేస్తానని తొలుత సీఎం రెవంత్‌రెడ్డి ప్రకటించారు.

### పాదయాత్ర కుదింపు

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తన పుట్టినరోజును పురస్కరించుకొని అదేరోజున మూసీ ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తానని తొలుత ప్రకటించారు. సంగెం గ్రామం నుంచి మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తారని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే మూడు రోజులు చేస్తానన్న పాదయాత్ర.. ప్రజా వ్యతిరేకత కారణంగా ఒక్కరోజుకే కుదించి మొక్కుబడిగా చేపడుతున్నట్టు అర్థమవుతున్నది. ఈ మేరకు శుక్రవారం ఉదయం సంగెం నుంచి మూసీ నది కుడి ఒడ్డు నుంచి యాత్ర ప్రారంభమై, భీమలింగం వరకు దాదాపు 2.5 కిలోమీటర్ల వరకే పాదయాత్ర కొనసాగుతుందని, అక్కడి నుంచి తిరిగి ధర్మారెడ్డిపల్లి కెనాల్ కట్ట వెంబడి నాగిరెడ్డిపల్లి రోడ్డు వరకు యాత్ర కొనసాగిస్తారని నిర్వాహకులు ప్రకటించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 9 నవంబర్ 2024



# కాంగ్రెస్ సామాజిక న్యాయం పేరుతో వంచన

## దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది

## మండిపడ్డ బిజెపి ఎంపి డాక్టర్ లక్ష్మణ్



హైదరాబాద్,నవంబర్ 8 : కాంగ్రెస్ నేతలు సామాజిక న్యాయం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని బిజెపి విమర్శించింది. వారి మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికి మోడల్ అవుతుందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందని భాజపా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు సామాజిక న్యాయం గురించి మాట్లాడటం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఈ మేరకు రాష్ట్ర భాజపా కార్యాలయంలో నిర్వహించిన మిడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాహుల్ గాంధీ ముందు వారి తాత, ముత్తాతలచరిత్ర తెలుసుకోవాలన్నారు. చరిత్ర తెలుసుకొని బడుగు బలహీనర్గాలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ చరిత్ర రేవంత్ రెడ్డికి తెలియదు. కులాల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించవద్దని అప్పట్లోనే రాష్ట్రాలకు నెహ్రూ లేఖలు రాశారు. బీసీల అభ్యున్నతి కోసం అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎటువంటి బీసీ కమిషన్ ఏర్పాటు చేయలేదు. మండల కమిషన్‌ను ఇందిరాగాంధీ పక్కన పెట్టారు. కుల ఆధారిత రిజర్వేషన్ల వల్ల దేశం బాగుపడదని రాజీవ్ గాంధీ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీల పట్ల ఎనలేని ప్రేమ ఒలక బోస్తున్నారు. అమెరికా పర్యటనలో రాహుల్ గాంధీ రిజర్వేషన్లు ఎత్తివేస్తామని చెప్పి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# సమగ్ర సర్వేతో సామాజిక వివక్ష రూపుమాపు

## మాజీ ఎంపీ వి.హనుమంతరావు



హైదరాబాద్, నవంబర్ 8 : హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సామాజిక వివక్షను రూపుమాపేందుకు దోహదపడుతుందని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. సమ గ్ర కుటుంబ ఇంటింటి సర్వే ప్రారంభమైన నేపథ్యంలో బాగ్అంబర్‌పేటలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. హనుమంత రావుతో పాటు అంబర్‌పేట కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి హాజరై క్షీరాభిషేకం చేశారు. అలాగే, అంబర్‌పేట డీఎంసీ మారుతి దివాకర్ ఆధ్వర్యం లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమంలో పాల్గొని ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. అనంతరం వి.హనుమంత రావు మాట్లాడుతూ, జనాభాకు అనుగుణంగా రాజ్యాంగ ఫలాలు అన్ని కులాలకు అందాలంటే సమగ్ర కులగణన జరగాల్సిందేనని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం భావించిందన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి చేత ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రల్లో ఈ సర్వేను నిర్వహించేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. రోహిణ్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో జరిగే సర్వేలో ప్రజలందరూ పాల్గొనే విధంగా కాంగ్రెస్ పార్టీ నా యకులు కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్, ఖైర తాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్లు రాంబాబు, పుల్లా నారాయణ స్వామి, పులిజగన్, గరిగంటి శ్రీదేవి రమేష్ తదితరులు పాల్గొన్నారు.'దమ్ముందా ఆ ఆంధ్రా కాంట్రాక్టర్‌ను ఆయన ఈస్టిండియా కంపెనీని కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి తీసివేయడానికి..? దమ్ముందా లేదా..?' అంటూ ప్రశ్నలు సంధించారు. 'సీఎం అయ్యి ఉండి మేఘాకు గులాంగిరీ చేస్తున్నావా..?' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ లోపాల గురించి ప్రశ్నించే శక్తి రావడానికి మీకింకా ఎంత సమయం పడుతుంది..?' అని కేటీఆర్ ఆంగ్లంలో ప్రశ్న వేశారు. 'తెలంగాణకు తొలి ప్రాధాన్యం అనే ఆలోచన రావడానికి మీకు ఇంకా ఎన్ని రోజులు కావాలి..?' అని నిలదీశారు. ఈ పోస్టుతోపాటు 'సుంకిశాల ఘటనలో కాంట్రాక్టర్‌పై చర్యలేవీ' అనే శీర్షికతో ప్రచురితమైన పత్రికా క్లిప్పింగ్‌ను కేటీఆర్ జత చేశారు.

# మావోయిస్టుల డంప్ స్వాధీనం

ములుగు,నవంబర్ 8 : మావోయిస్టులు భద్రపర్చుకున్న డంపు, మందుగుండు సామగ్రిని ములుగు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ శబరీశ్ వివరాలను వెల్లడించారు. ఎస్పీ కథనం ప్రకారం.. తాడ్వాయి మండలం బంధాల రిజర్వ్ అటవీ ప్రాంతంలోని ఒడ్డుగూడెం గ్రామ సమీపంలోని వె÷-టటెవాగు వద్ద సీపీఐ మావోయిస్టు ఆయుధాల డంపు ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో శుక్రవారం ఉదయం ములుగు జిల్లా పోలీసులతో పాటు బీడీటీం బృందాలు అనుమానాస్పద ప్రాంతానికి చేరుకొని సోదాలు నిర్వహించాయి. సీపీఐ మావోయిస్టులు అమర్చిన ఆయుధాల డంపును గుర్తించాయి. అందులో రెండు ఎస్ఎల్ఆర్ తుపాకులతో పాటు 165 రౌండ్ల తూటాలు, ఒక స్పిం÷-రగ్ ఫీల్, రెండు ఎస్ఎల్ఆర్ మాగ్జిన్ల పౌచ్‌లను స్వాధీనం
చేసుకున్నారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోతే ప్రభుత్వం ద్వారా పునరావాసం కల్పిస్తామని ఎస్పీ వెల్లడించారు. ఆయన వెంట ఏఎస్పీ రవీందర్, సీఐ రవీందర్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ప్రజావాణికి 471 దరఖాస్తులు

హైదరాబాద్,నవంబర్ 8 : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 471 దరఖాస్తులు అందాయి. బిసి వెల్ఫేర్ శాఖకు సంబంధించి 156, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 87, విద్యుత్ శాఖ కు సంబంధించి 75, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 50 ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 04, ఇతర శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.





# నరసింహ స్వామి దగ్గరికి సీఎం రేవంత్‌రెడ్డి మోకాళ్ల యాత్ర చేయాలి

## బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 8 : పాదయాత్ర కాదు ముందు యాదగిరి నరసింహ స్వామి దగ్గరికి సీఎం రేవంత్ రెడ్డి మోకాళ్ల యాత్ర చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి సూచించారు. రేవంత్ రెడ్డి చేసేది పాదయాత్ర కాదు పాపపు యాత్ర, ప్రాయశ్చిత్త యాత్ర, పశ్చాత్తాప యాత్ర అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో తెలంగాణ ప్రజలకు ప్రతినిధిగా ఉంటూ ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తానని రైతులకు హామీ ఇస్తూ.. ఏకంగా లక్ష్మీనరసింహ స్వామి మీద ఒట్టేశారని ఏనుగుల రాకేశ్ రెడ్డి గుర్తుచేశారు. రాజ్యాన్ని పాలించే రాజు ఒట్టేసే మాట తప్పితే ఆ ప్రభావం, దైవాగ్రహం ప్రజల మీద పడుతుందని చెప్పారు. అందుకే, తెలంగాణలో గత వర్షాకాలం వర్షాలు ఆలస్యంగా పడ్డాయని అన్నారు. ములుగు అడవులు కూడా ఎన్నడూ జరగని విధంగా విధ్వంసమయ్యాయని.. ధామగుండంలో చెట్లు పోతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ నాశనమైందని.. రియల్ ఎస్టేట్ రంగం, వ్యాపారాలు, కొనుగోలు అమ్మకాలు ఎక్కడిక్కడ ఆగిపోయాయని.. మార్కెట్లో రూపాయి తిరిగే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. మూసీ పుట్టిన వికారాబాద్‌లో అడవులు ధ్వంసం చేసి.. మూసీ ప్రవహించే హైదరాబాద్‌లో ఇల్లు కూలగొట్టి వలిగొండలో పాదయాత్ర చేస్తావా అని రేవంత్ రెడ్డిపై ఏనుగుల రాకేశ్ రెడ్డి మండిపడ్డారు. అయినా పాదయాత్ర చేయాల్సింది రైతుల కల్లాల కాడికి, ఛిద్రమైన మా పోచంపల్లి చేనేతల మగ్గాల కాడికి, నిత్యం ఆసుపత్రుల పాలవుతున్న మా గురుకుల విద్యార్థుల దగ్గరకు అని అన్నారు. ప్రజల మద్దతు ఉంటే మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులను ఎందుకు అక్రమంగా అరెస్టు చేస్తున్నావని ప్రశ్నించారు. ప్రజలు నిలదీస్తారని ఈ కథలు పడుతున్నావ్.. దమ్ముంటే సెక్యూరిటీ లేకుండా పాదయాత్ర చేయాలని డిమాండ్ చేశారు.

# గురుకులల్లో విద్యార్థులు చస్తుంటే బర్తుడే వేడుకలా

## బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్




హైదరాబాద్, నవంబర్ 8 : రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు అన్ని గురుకుల పాఠశాలల్లో అధికారికంగా నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడాన్ని ఖండిస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఉపాధ్యక్షుడు తుంగబాలు, రఘురాంతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా పని చేసిన పొన్నం ప్రభాకర్‌కు నిబంధనలు తెలియవా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు గురుకుల పాఠశాలల్లో ఎందుకు చేయాలన్నారు. రాష్ట్రంలో అన్ని గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు దవాఖాన పాలు అవుతున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా కూడా గురుకుల పాఠశాలలపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రివ్యూ చేయలేదని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఫుడ్ పాయి-ుజన్‌తో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురి అయ్యారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను చంపడమే కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమా? అని నిలదీశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే గురుకుల పాఠశాలలకు పర్మినెంట్ బిల్డింగ్స్ కట్టాలన్నారు. గురుకుల పాఠశాలలకు ప్రభుత్వం నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల్లో సమస్యలు అడిగి తెలుసుకుంటామని, సమస్యల దరఖాస్తులను కేటీఆర్, ప్రభుత్వానికి ఇస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అన్ని వ్యవస్థలను కుప్పకూలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీలో మరింత అధ్వానంగా గాలిలో నాణ్యత

## పలు చోట్ల ఏక్యూఐ లెవల్స్ 400లు నమోదు



న్యూఢిల్లీ, నవంబర్ 8 : దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా ఎనిమిదవ రోజూ గాలి నాణ్యత అధ్వానంగా మారింది. పలు చోట్ల ఏక్యూఐ లెవల్స్ 400గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. శుక్రవారం ఉదయం ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి సూచీ 383గా నమోదైంది. బవానా ప్రాంతంలో గాలి సూచీ 440గా, ముండ్కాలో 428, న్యూ మోతీ బాగ్‌లో 427, రోహిణి ప్రాంతంలో 439, పంజాబీ బాగ్‌లో 406, ఆర్‌కే పురంలో 406గా నమోదైంది. వీటితోపాటు ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదైంది. మ-రోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరోవైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యమునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 గంటలకు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 367కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఇది 400కు చేరింది. ఇటీవలే కాలుష్యం కారణంగా శ్వాసకోశ వ్యాధులతో దవాఖానలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు తెలిపారు. దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రంగా పతనమవుతుండటంతో కేంద్రం కఠిన చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పంట వ్యర్థాలు తగులబెట్టినవారికి విధించే జరిమానాను రెట్టింపు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, రెండు ఎకరాల కన్నా తక్కువ భూమి గల రైతులపై పర్యావరణ నష్టపరిహారం రూ.5 వేలు విధించవచ్చు. రెండెకరాల నుంచి ఐదు ఎకరాల లోపు భూమి కలవారికి రూ.10 వేలు, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ భూమి కలవారికి రూ.30 వేల వరకు విధించవచ్చు. ఢిల్లీతోపాటు దేశంలోని ఇతర నగరాల్లోనూ గాలి నాణ్యత సూచీ మోడరేట్ కేటగిరీలో నమోదైంది. ముంబై లో ఏక్యూఐ లెవల్స్ 123గా, పూణెలో 114గా రికార్డయ్యాయి. రెండు నగరాల్లో శనివారం వరకు అవి 'మధ్యస్థంగా' ఉండే అవకాశం ఉన్నట్లు స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక కోల్‌కతాలో ఏక్యూఐ 163గా కొనసాగుతోంది. అయితే, ట్రాఫిక్‌కు పేరు గాంచిన బెంగళూరు మహానగరంలో గాలి నాణ్యత సూచీ 'సంతృప్తికరమైన' కేటగిరీలో నమోదవడం విశేషం. నగరంలో శుక్రవారం ఉదయం ఏక్యూఐ 81గా ఉంది. లక్నోలో 159, పాట్నాలో 184, అహ్మదాబాద్‌లో 62గా ఏక్యూఐ లెవల్స్ నమోదయ్యాయి.

# మంచిర్యాల గురుకులాల్లో విద్యార్థులకు అస్వస్థత

మంచిర్యాల, నవంబర్ 8 : వసతుల లేమితో గురుకులాలకు వెళ్లాలంటేనే పిల్లలు జంకుతున్నారు. పలు గురుకులాల్లో విద్యార్థులు హాస్టల్ వదిలి ఇంటిబాట పడుతున్నారు. తాజాగా మంచిర్యాలలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినికి మరోసారి వాంతులు కాగా, మరో విద్యార్థినికి కడుపు నొప్పితో బాధపడింది. గమనించిన సిబ్బంది హుటాహుటిన ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. కాగా, జిల్లా కేంద్రంలోని సాయికుంటలో గల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 12 మంది విద్యార్థినులు కొద్ది రోజుల క్రితం ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అయితే చికిత్స పొందుతున్న విద్యార్థులు ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో బాలికల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం 9 నవంబర్ 2024






# అసెంబ్లీకి వెళ్లని వారు రాజీనామా చేయండి

### జగన్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన షర్మిల

### ప్రజలు ఎన్నుకున్నది అసెంబ్లీకి వెళ్లడానికే అని స్పష్టీకరణ

మచిలీపట్నం,నవంబర్ 8 : అసెంబ్లీకి వెళ్లనివారు ఎవరైనా రాజీనామా చేయాల్సిందేనని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. జగన్ అయినా, వైకాపా ఎమ్మెల్యేలైనా రాజీనామా చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలుగా గెలిచాక అసెంబ్లీకి వెళ్లమంటే కుదరదని అన్నారు. ప్రజలు ఎన్నుకున్నది అసెంబ్లీకి వెళ్లాలని కానీ, ఇంట్‌ఓ కూర్చోవడానికి కాదన్నారు. ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని వైకాపా అధినేత జగన్ ప్రకటించడంపై షర్మిల తీవ్రంగా స్పందించారు. మచిలీపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేకపోతే పదవుల్లో ఉండటం ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకుంటే అసెంబ్లీకి వెళ్లి ఏం మాట్లాడగలం అని జగన్ మాట్లాడిన విషయం తెలిసిందే. అసెంబ్లీకి వెళ్లకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వాన్ని మీడియా సమావేశాల ద్వారా ప్రశ్నిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ విషయంలో జగన్ తీరును షర్మిల తీవ్రంగా పరిగణించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని వైఎస్ఆర్‌సీప చీఫ్ జగన్ తీసుకున్న నిర్ణయంపై షర్మిల విమర్శలు గుప్పించారు. అసెంబ్లీకి వెళ్లే ధైర్యం లేని వారు రాజీనామా చేయాలన్నారు. జగన్ అయినా ఎమ్మెల్యేలు అయినా అసెంబ్లీకి వెళ్లకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని ఆ హోదా లేకపోవడం వల్ల మాట్లాడేందుకు మైక్ ఇవ్వరని వైసీపీ చీఫ్ జగన్ అంటున్నారు. అందు వల్ల అసెంబ్లీకి వెళ్లినా ప్రయోజనం ఉండదని అందుకే తాము వెళ్లబోవడం లేదన్నారు. మీడియానే మాకు స్పీకర్ అని.. మీడియా ముదే తాము తమ వాదన వినిపిస్తామని జగన్ స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నంత సేపు తాము తమ వాదన మీడియా ముందు వినిపిస్తామని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 11 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఈ కారణంగా ఆయనను ప్రధాన ప్రతిపక్ష నేతగా అర్హత సాధించలేదు. సంప్రదాయంగా పది శాతం అసెంబ్లీ సీట్లను గెల్చుకున్న వారికి ప్రధాన

ప్రతిపక్ష నేత హోదా ఇస్తారు. రెండు కన్నా ఎక్కువ పార్టీలు అలా గెల్చుకుని ఉంటే ఎక్కువ సీట్లు గెల్చుకున్న వారికి ఇస్తారు. వైసీపీకి పది శాతం అసెంబ్లీ సీట్లు రాకపోవడంతో ప్రధాన ప్రతిపక్ష నేత హోదా సాంకేతికరంగా రాలేదు. అయితే స్పీకర్ విచక్షణాధికారం ప్రకారం ఇవ్వొచ్చు. కానీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ లోపు వైఎస్ జగన్ తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వడం లేదని హైకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేశారు. దానిపై విచారణ వాయిదా పడింది. మామూలుగా అయితే ఆయన వైసీపీ పక్ష నేత జగనేనని ఆయన ప్రతిపక్ష పార్టీనే కాబట్టి ప్రతిపక్ష నేతేనని కాదని ఎవరూ అనడం లేదని అంటున్నారు. అసెంబ్లీలో ఎన్డీఏ కూటమితో పాటు ఒక్క వైసీపీ మాత్రమే ఉంది. అందుకే మాట్లాడేందుకు సమయం వస్తుందని జగన్ అసెంబ్లీకి రావాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడు కూడా ఆహ్వానిస్తున్నారు. కానీ గత అసెంబ్లీలో జరిగిన పరిణామాలను బట్టి అసెంబ్లీకి హాజరైతే తమనూ అవమానిస్తారని వైసీపీ ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. జగన్ హాజరు కాకపోతే ఎమ్మెల్యేలను అయినా పంపితే ప్రజాస్వామ్యాన్ని గౌరవించినట్లు ఉంటుందని కొంత మంది వాదిస్తున్నారు. కానీ జగన మాత్రం.. అసెంబ్లీకి హాజరయ్యేది లేదని చెబుతున్నారు. బహుశా.. ఐదేళ్ల పాటు వారు హాజరు కాకపోతే.. నిబంధనల ప్రకారం వరుసగా మూడు సెషన్లకు హాజరు కాకపోతే అనర్హతా వేటు వేసే అధికారం స్పీకర్ కు ఉంటుంది.

## నోటీసుల వెనుక రాజకీయ కోణం

### తమ్ముడి భార్యకు నోటీసులపై స్పందించిన కేతిరెడ్డి

అమరావతి, నవంబర్ 8 : చెరువు భూములు కబ్జా చేశారని తన తమ్ముడి భార్యకు నోటీసులు ఇవ్వడంపై ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి స్పందించారు. తనకు ఇచ్చిన నోటీసుల వెనుక రాజకీయ కోణం ఉందని ఆయన ఆరోపించారు. చెరువు భూములు కబ్జా చేశారని వచ్చిన ఆరోపణలపైనే గతంలోనే కోర్టుకు వెళ్లానని తెలిపారు. దీనికి సంబంధించిన కేసు కోర్టులో ఉన్నప్పటికీ అధికారంలో ఉన్నవారు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయంలో కంటెంట్ ఆఫ్ కోర్టు కింద కేసు వేస్తానని హెచ్చరించారు. తన భూముల విషయంలో చాలా క్లియర్‌గా ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ధర్మవరం రెవెన్యూ గ్రామ పరిధిలోని 904, 905, 908, 909 సర్వే నంబర్లలో కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తమ్ముడు (వెంకటకృష్ణారెడ్డి) భార్య వసుమతి పేరుతో రైతుల నుంచి 25 ఎకరాలు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉంది. అయితే వీటికి ఆనుకుని 908, 909, 910, 616-1 సర్వే నంబర్లలో ఉన్న చెరువు స్థలం 20 ఎకరాల వరకు ఆక్రమించి కలిపేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం 45 ఎకరాల్లో పలు రకాల పండ్ల తోటలు సాగుచేశారు. ఇందులోనే లగ్జరీ ఫామ్‌హౌజ్, రేసింగ్ ట్రాక్ నిర్మించారు. దీంతో 20 ఎకరాల చెరువు భూమిని కబ్జా చేశారనే ఆరోపణలపై వసుమతికి నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఏడు రోజుల్లోగా కబ్జా చేసిన స్థలాలను ఖాళీ చేయకపోతే అందులో ఉన్న నిర్మాణాలు, చెట్లు, పంటలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. 2023 ఏప్రిల్‌లో టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ధర్మవరం చెరువు కబ్జాపై ఆయన ఆరోపణలు చేశారు. వాటిని నిరూపించుకోవాలంటూ కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి సవాలు విసిరారు. ఆ మరుసటి రోజే చెరువు కబ్జాకు సంబంధించిన ఆధారాలను నారా లోకేశ్ విడుదల చేశారు. అధికారంలోకి రాగానే కేతిరెడ్డి కబ్జాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందులో భాగంగానే చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం.

## సొంత చెల్లిపై అభ్యంతరకర పోస్టులకు వత్తాసా

### వర్రా రవీంద్రరెడ్డిని వెనకేసుకు వస్తారా

### జగన్ వ్యాఖ్యలపై మండిపడ్డ టిడిపి నేత వర్ల

అమరావతి, నవంబర్ 8 : వర్రా రవీంద్ర రెడ్డి అనే సోషల్ మీడియా యాక్టివిస్ట్ అత్యంత అమాయకుడు, అతని కోసం ఎంతమంది లాయర్లనైనా పెడతానని వైసీపీ అధినేత జగన్ అనడం హాస్యాస్పదమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడడానికి సిగ్గుండాలని అన్నారు. మీడియా సమావేశంలో వర్రా రవీంద్రను జగన్ మంచివాడని అనడంతో సిగ్గుకే సిగ్గనిపించి ఉంటుందని కామెంట్స్ చేశారు. జగన్ చెల్లిపై పెట్టిన పోస్టుపై జగన్ కు రక్తం ఉడికి ఉంటుందనుకునేరు.. కానీ అలా జరగలేదన్నారు. ఎవరికో పుట్టిన షర్మిలను జగన్ తన సొంత చెల్లిలా చూసుకున్నాడు అని వర్రా రవీంద్ర రెడ్డి పోస్టు పెడితే జగన్ ఈ విధంగా స్పందించడం చెల్లి పట్ల ఆయనకున్న అభిప్రాయం తెలుస్తోందని వ్యాఖ్యానించారు. జగన్ చెల్లి షర్మిలపై నీతిబాహ్యమైన వ్యాఖ్యలు చేసిన వర్రా రవీంద్రారెడ్డిని వెనకేసుకరావడానికి సిగ్గుచేటుగా లేదా జగన్ అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వర్రా రవీంద్రరెడ్డి మంచివాడు అని జగన్ అంటే నేను జగన్ ఇంటిముందు నిలబడి సెల్యూట్ చేస్తా అని ఛాలెంజ్ చేశారు. షర్మిలపై పెట్టిన పోస్టులు అత్యంత అసభ్యకరమైనవి, జుగుప్సాకరమైనవి. ఇంతటి జుగుప్సాకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని కాపాడడానికి జగన్ కు మనసెలా ఒప్పిందని వర్ల రామయ్య ప్రశ్నించారు.జగన్ దుర్మార్గం, దురాలోచనతో ఎదుటివారిని మానసికంగా హింసించి శునకానందం పొందేవారని విమర్శలు గుప్పించారు. ఆ దురాలోచనే జగన్ తల్లిని, చెల్లిని తాకాయన్నారు. అసభ్యకర పోస్టులు పెట్టినవారిని కాపాడడం కోసం కోట్లాది రూపాయలు ఖర్చుచేసి వార్ రూమ్ జగన్ పెట్టడం దుర్మార్గం అంట్గూ ÷ర్ అయ్యారు. తల్లిని, చెల్లిని దూషిస్తే ఊరుకునేవారిలో జగన్ ప్రథముడని వర్ల రామయ్య కామెంట్స్ చేశారు. డాక్టర్ సుధాకర్ ను నడి రోడ్డుపై ఈడ్చి, వేధించి ఆ డాక్టర్ మృతికి కారణమైంది వైసీపీ ప్రభుత్వమేనన్నారు.16 ఏళ్ల దళిత మహిళను ఐదుగురు దుండగులు పోలీసు స్టేషన్

వెనుక గదిలో అత్యాచారం చేసి పోలీసు స్టేషన్ ముందు పడేస్తే అప్పుడు గుర్తుకు రాలేదా జగన్ కు ప్రజాస్వామ్యం? అని నిలదీశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ లను, చివరకు మమ్మల్ని తిట్టారు, కుటుంబాలను నిందించారు అయినా సహించాం..జగన్ తల్లి, చెల్లిల గురించి బూతు పోస్టులు పెట్టిన వర్రా రవీంద్ర రెడ్డిని అరెస్టు చేయాలో? వద్దో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఉగాండాలో ఉన్న కొడుకు.. సోషల్ మీడియాలో కదిరి ఎమ్మెల్యే ఓబుల్ రెడ్డి పనితీరును ప్రశ్నిస్తూ పోస్టు పెడితే 70 ఏళ్ల వయసున్న వాళ్ల నాన్న అయిన వృద్ధుడిని పోలీసులు అరెస్టు చేసి హింసించారన్నారు. జగన్ కుటుంబసభ్యులైన తల్లి, చెల్లిల గురించి పెట్టిన పోస్టులు చూసి ఇతరులకే జుగుప్సకలిగిస్తుంటే.. జగన్ మాత్రం మౌనం వహించడంలో మర్మమేమిటి? అని ప్రశ్నించారు. జగన్ మానసిక స్థితి గురించి ఏమనుకోవాలో.. వైసీపీ నాయకుల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు.

## మార్చురిలో మృతదేహంపై బంగారం చోరీ

జోగులాంబ గద్వాల,నవంబర్ 8 : జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో దారుణం చోటు చేసుకుంది. మార్చురీలో మృతదేహంపై ఉన్న బంగారం చోరీకి గురైంది. గోనుపాడు దగ్గర రోడ్డు ప్రమాదంలో మెరిసా అనే మహిళ మృతి చెందింది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు దవాఖానలోని మార్చురీలో ఉంచారు. అయితే మృతదేహాన్ని భద్రపరిచే సమయంలో ఉన్న నగలు తర్వాత కనిపించలేదు. మృతురాలి ఒంటిపై ఉన్న తులం బంగారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దవాఖాన సిబ్బందిపై వారు అనుమానం వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రెండు గంటలు ట్రాఫిక్‌ల్లోనే

### అయినా పదినిమిషాల్లో ఫుడ్ డెలివరీ

అమరావతి, నవంబర్ 8 : మన దేశంలో ట్రాఫిక్ జామ్ అంటే ముందుగా గుర్తొచ్చేది కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగరమే. స్వల్ప దూరానికే గంటలు గంటలు వేచి చూడటం నగర పౌరులకు నిత్యం అనుభవమే. వాహనాల ట్రాఫిక్‌తో ప్రయాణం నరకప్రాయంగా ఉండే నగరాల జాబితాలో బెంగళూరుది దేశంలోనే అగ్రస్థానం. ఇక్కడ కిలోమీటరు దూరానికి గంటల తరబడి రోడ్లపైనే పడిగాపులు కాయాల్సి వస్తుంది. దీంతో ప్రజలు తమ ట్రాఫిక్ కష్టాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. అలా, ఇటీవలే ఓ నెటిజన్ బెంగళూరు ట్రాఫిక్‌కు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. అర్పిత్ అరోరా అనే నెటిజన్ ఈనెల 5న ఎక్స్‌లో ఓ ట్వీట్ పెట్టాడు. దాదాపు రెండు గంటల పాటు తాను ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయినట్లు చెప్పారు. అయితే ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. పీక్ ట్రాఫిక్ ఫుడ్ డెలివరీకి మాత్రం ఎలాంటి ఆటంకం కలిగించకపోవడం. రెండు గంటల పాటు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన అతడు.. అక్కడి నుంచే ఫుడ్ ఆర్డర్ చేయగా 10 నిమిషాల్లోనే డెలివరీ అయినట్లు చెప్పారు. అయితే, ఫుడ్ తినడం అయిపోయినా కూడా ట్రాఫిక్ మాత్రం ముందుకు కదలడం లేదంటూ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుతం అతడి ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'బెంగళూరు మహానగరంలోనే ఇలాంటివి సాధ్యం' అంటూ చమత్కరిస్తున్నారు. కాగా, సిలికాన్ వ్యాలీగా పేరుగాంచిన బెంగళూరు మహానగరంలో ట్రాఫిక్ కష్టాల గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. రోజురోజుకూ నగరంలో ట్రాఫిక్ పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల బాధలు వర్ణనాతీతం. ప్రపంచంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే నగరాల్లో బెంగళూరుది రెండో స్థానం. ఇక్కడ 2-3 కిలోమీటర్ల ప్రయాణానికే గంటల సమయం పడుతోంది. పని మీద బయటకు వెళ్లాలంటనే ట్రాఫిక్ బారులను చూసి పౌరులు బెంబేలెత్తిపోతున్నారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలకు అద్దం పట్టే ఘటనలు ఇప్పటికే సోషల్ మీడియాలో అనేకం వెలుగులోకి వచ్చాయి. సుదీర్ఘ ట్రాఫిక్ జామ్‌ను తప్పించుకునేందుకు అనేకమంది నగర వాసులు మెట్రో రైలు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను అనుసరిస్తున్నారు. నగరంలోని 95 శాతం మంది వాహనాల యజమానులు కూడా ఇదే చెబుతున్నారని పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.


## రైతులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త

### స్వేచ్ఛగా ధాన్యం అమ్ముకునే వెసలుబాటు

అమరావతి, నవంబర్ 8: రైతులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులు ఎలాంటి నిబంధనల అడ్డు లేకుండానే ధాన్యాన్ని అమ్ముకోవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆయిల్ ఫామ్ రైతు సంఘం ప్రతినిధులు, కంపెనీల యాజమాన్యాలు, వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వైసీపీ హయాంలో ధాన్యం సేకరణ అస్తవ్యస్తమైందని మంత్రి మండిపడ్డారు. పంటను కొనుగోలు చేసిన 48 గంటల్లోనే అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని స్పష్టం చేశారు. రైతుల నుంచి ప్రతి గింజ కొంటామని అన్నారు. అలాగే, రాష్ట్రంలో పామాయిల్ రైతులకు స్థిరమైన ధరలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆయిల్ ఫామ్ ధరలపై ఆయిల్ ఫామ్ రైతుల ప్రయోజనాల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. దేశంలోనే అత్యధిక శాతం ఆయిల్ ఫాం సాగు, అత్యధిక దిగుబడి వచ్చే రాష్ట్రం మనది. మన రాష్ట్రంలోనే మన రైతులకు ఆయిల్ ఫామ్ క్షఇఖీ ధర నిర్ణయించే పరిస్థితి తీసుకొస్తాం. రైతులకు మేలు జరిగేలా, కంపెనీలు పరిశ్రమ విస్తరించే విధంగా కృషి చేస్తాం. పామాయిల్ ధరలపై సీఎం చంద్రబాబుతో చర్చిస్తాం. గత ప్రభుత్వం రైతులను మోసం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పామాయిల్ రైతులకు ఊరట లభించింది. అధికారంలోకి వచ్చిన 4 నెలలకే టన్ను ధర రూ.12,500 నుంచి ఏకంగా రూ.19.000కి ధర పెరిగింది.' అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గత ఐదేళ్లలో ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారిపై కేసులు పెట్టి జగన్ పైశాచిక ఆనందం పొందాడని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తోందని అన్నారు. 'మా ప్రభుత్వంలో కక్ష సాధింపు లేదు. తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా చట్ట ప్రకారం చర్యలు చేపడుతున్నాం. జగన్మోహన్ రెడ్డికి బుద్ధి జ్ఞానం ఉందా?. బావ స్వేచ్ఛ అంటూ జగన్ వ్యక్తి హననానికి పాల్పడుతున్నారు. భావ స్వేచ్ఛ ప్రకటన అంటూ ఆడవారిపై పోస్టులు పెడుతున్నారు. సోషల్ మీడియా పోస్టుల వల్ల పవన్ కళ్యాణ్ బాధపడ్డారు. జన్మనిచ్చిన తల్లి, చెల్లిపై కూడా తప్పుడు పోస్టులు పెట్టిన జగన్ మనిషేనా?. ఆడవారిని ఏడిపిస్తే చూస్తూ ఊరుకోం, ఖబర్దార్ జగన్!. అధికారంలో ఉన్నా లేకపోయినా మేం ప్రజా సమస్యలపై స్పందిస్తామని పేర్కొన్నారు.

## ఎట్టకేలకు మహిళా అఘోరీకి ఆలయంలోకి అనుమతి

అమరావతి, నవంబర్ 8 : శ్రీకాళహస్తిలో మహిళా అఘోరీ దిగంబరంగా ఆలయంలోకి వెళ్లేందుకు యత్నించి హల్‌చల్ చేసింది. ఎట్టకేలకు వస్త్రాలు ధరించి శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకునేందుకు అంగీకరించారు. దీంతో పోలీసుల బందోబస్తు నడుమ దర్శనం ముగించుకుని క్షేత్రాన్ని విడిచి వెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. కొద్దిరోజులుగా ఆంధ్రప్రదేశ్‌లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటూ వస్తున్న మహిళా అఘోరీ (నాగ సాధువు) గురువారం నాడు తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తికి వచ్చారు. దిగంబరంగా ఆలయంలోని శివయ్య గోపురం గుండా లోపలికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో ఆమెను మహానందీశ్వరుడి ప్రతిమ సమీపంలో భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దుస్తులు లేకుండా ఆలయంలోకి అనుమతించేది లేదని సిబ్బంది సూచించారు. దీంతో భద్రతా సిబ్బందితో ఆమె వాగ్వాదానికి దిగారు. తనను ఎలాగైనా దర్శనానికి పంపాల్సిందేనని పోలీసులతో గొడవకు దిగారు. ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మార్పణ చేసుకునేందుకు కూడా యత్నించారు. దీంతో పట్టణ పోలీసులు, ఆలయ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. బలవంతంగా ఆమెకు వస్త్రాలు చుట్టి.. ఆలయ అంబులెన్స్‌లో మహిళా భద్రతా సిబ్బందితో బందోబస్తుగా తమిళనాడు పరిధిలోని ఆరంబాకంలో వదిలిపెట్టారు. అయితే గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో మళ్లీ మహిళా అఘోరి శ్రీకాళహస్తికి వచ్చారు. సంప్రదాయ దుస్తులను ధరించి వస్తేనే దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారులు నచ్చజెప్పారు. ఎట్టకేలకు ఎర్రని వస్త్రంతో శరీరాన్ని కప్పుకుని.. కపాల మాలలు తీసి వేసి ఆలయంలోకి వెళ్లేందుకు సుముఖత చూపించారు. దీంతో పోలీసు బందోబస్తు నడుమ అఘోరీ శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 9
నవంబర్
2024





# శాంసన్ ధనాధన్

వరుసగా రెండో
శతకం బాదిన సంజూ
రాణించిన తిలక్ వర్మ
స్పిన్నర్ల ధాటికి సఫారీలు విలవిల
తొలి టీ20లో భారత్ ఘనవిజయం

**ప్రధాన ఆటగాళ్ల పనిభారం నిర్వహణలో వరుస అవకాశాలు దక్కించుకుంటున్న వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్.. టీ20 క్రికెట్‌లో ఇప్పటిదాకా మరే భారత క్రికెటర్‌కు సాధ్యం కాని రీతిలో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో విరుచుకుపడటంతో దక్షిణాఫ్రికా పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. సంజూ, తిలక్ వర్మ దూకుడుతో భారీ స్కోరుచేసిన టీమ్‌ఇండియా.. ప్రత్యర్థిని కట్టడిచేయడంలోనూ విజయవంతమైంది. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ సఫారీలకు చుక్కలు చూపించారు.**




కింగ్స్‌మీడ్ (డర్బన్): టీమ్‌ఇండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 107, 7 ఫోర్లు, 10 సిక్సర్లు) శతకంతో కదంతొక్కడంతో దక్షిణాఫ్రికా పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. కింగ్స్‌మీడ్ మైదానం వేదికగా ముగిసిన తొలి టీ20లో భారత్ 61 పరుగుల తేడాతో సఫారీలను ఖంగుతినిపించి నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. శాంసన్‌తో పాటు తిలక్ వర్మ (18 బంతుల్లో 33, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జి (3/37) రాణించాడు. అనంతరం భారీ ఛేదనలో సఫారీలు.. భారత స్పిన్నర్ల ధాటికి 17.5 ఓవర్లలో 141 పరుగులకే పరిమితమయ్యారు. హెన్రిచ్ క్లాసెన్ (25) టాప్ స్కోరర్. వరుణ్ (3/25), బిష్ణోయ్ (3/28) దక్షిణాఫ్రికాను కట్టడిచేశారు. సంజూ శాంసన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

**శాంసన్..మళ్లీ దంచెన్!**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఆది నుంచే వేగంగా ఆడేందుకు యత్నించింది. ఈ వ్యూహాన్ని శాంసన్ పకడ్బందీగా అమలుచేయగా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (7) మరోసారి నిరాశపరిచాడు. మార్క్మ్ 4వ ఓవర్లో బౌండరీతో పరుగుల వేట మొదలుపెట్టిన సంజూ.. మహారాజ్ 3వ ఓవర్లో 4, 6తో అతడికి స్వాగతం పలికాడు. క్రీజులోకి రావడంతోనే ఫోర్, సిక్సర్ బాదిన సూర్యకుమార్ యాదవ్ (17 బంతుల్లో 21, 2 ఫోర్లు, 1 సిక్స్) అండతో సంజూ మరింత రెచ్చిపోయాడు. జాన్సెన్ 5వ ఓవర్లో 4,6,4 బాదడంతో తొలి పవర్ ప్లే ముగిసేసరికి భారత్ స్కోరు 56/1 చేరింది. ఎంగబా పీటర్ 8వ ఓవర్లో రెండు వరుస సిక్సర్లతో 27 బంతుల్లోనే సంజూ అర్ధ శతకం పూర్తయింది.

క్రూగర్ 9వ ఓవర్లో ఆఖరి బంతికి సూర్య ఔట్ అవడంతో 37 బంతుల్లోనే 66 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సిమలెన్ 13వ ఓవర్లో రెండు బౌండరీలు, లాంగాఫ్ వద్ద ఓ భారీ సిక్సర్‌తో 90లలోకి వచ్చిన శాంసన్.. మహారాజ్ 15వ ఓవర్లో సింగిల్ తీసి వరుసగా రెండో శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. 47 బంతుల్లోనే అతడి శతకం పూర్తయింది. క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించిన తిలక్.. ఇదే ఓవర్లో భారీ షాట్ ఆడబోయి డీప్ స్కేర్ లెగ్ వద్ద జాన్సెన్ చేతికి చిక్కాడు. ఆ మరుసటి ఓవర్లో శాంసన్ సైతం పీటర్ బౌలింగ్‌లో స్టబ్స్ చేతికి చిక్కాడు. శాంసన్ ఔట్ అయ్యేటప్పటికీ 16 ఓవర్లలో 175/4గా ఉన్న భారత స్కోరు ఒక దశలో 250 దాకా వెళ్తుందని అభిమానులు ఆశించినా చివరి 4 ఓవర్లలో 27 పరుగులే చేసింది.

**స్పిన్ మాయకు విలవిల**

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌతాఫ్రికాకు ఆరంభం నుంచే కష్టాలు తప్పలేదు. ఆరంభంలో పేసర్లు, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు సఫారీలను కట్టడి చేశారు. తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన మార్క్మ్ (8) అర్ష్‌దీప్ బౌలింగ్‌లో సంజూకు క్యాచ్ ఇచ్చాడు. అవేశ్ ఖాన్ 4వ ఓవర్లో ప్రమాదకర ట్రిస్టన్ స్టబ్స్ (11)ను పెవిలియన్‌కు పంపాడు. 3 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 11 బంతుల్లోనే 21 రన్స్ రాబట్టిన రికెల్టన్.. వరుణ్ చక్రవర్తి 6వ ఓవర్లో లాంగాన్ వద్ద తిలక్ వర్మ చేతికి చిక్కాడు. ఈ క్రమంలో క్లాసెన్, మిల్లర్ ఆ జట్టును ఆదుకున్నారు. 4 వికెట్‌కు ఈ ద్వయం 42 రన్స్ జతచేశారు. చక్రవర్తి ఒకే ఓవర్లో ఈ ఇద్దరినీ ఔట్ చేసి సఫారీలను కోలుకోలేని దెబ్బతీశాడు. మరుసటి ఓవర్లో బిష్ణోయ్ కూడా క్రూగర్ (1), సిమలెన్ (6)ను పెవిలియన్‌కు పంపాడు. జాన్సెన్ (12)ను బిష్ణోయ్ ఔట్ చేయడంతో సఫారీల ఓటమి ఖరారైంది.

1- పొట్టి ఫార్మాట్‌లో భారత్ తరఫున రెండు శతకాలు చేసిన ఏకైక వికెట్ కీపర్ బ్యాటర్ శాంసన్.

2- క్యాలెండర్ ఈయర్‌లో ఏడు సార్లు 200 ప్లస్ స్కోరు చేయడం భారత్‌కు ఇది వరుసగా రెండోసారి.

4 %-% టీ20లలో వరుసగా రెండు శతకాలు చేసిన ఆటగాళ్లలో శాంసన్ నాలుగోవాడు. గుస్తవ్ మెక్‌కియోన్, రిలీ రూసో, ఫిల్ సాల్ట్.. సంజూ కంటే ముందున్నారు. భారత్ నుంచి ఈ ఘనత సాధించింది అతడొక్కడే.

**సంక్షిప్త స్కోర్లు**

భారత్ : 20 ఓవర్లలో 202/8 (శాంసన్ 107, తిలక్ 33, కొయెట్జి 3/37, జాన్సెన్ 1/24)

దక్షిణాఫ్రికా: 17.5 ఓవర్లలో 141 (క్లాసెన్ 25, రెకెల్టన్ 21, వరుణ్ 3/25, బిష్ణోయ్ 3/28)

# రాహుల్ ఫట్.. జురెల్ హిట్




ధ్రువ్ అర్ధ శతకం
నెసర్‌కు 4 వికెట్లు
భారత్-ఎ 161, ఆసీస్-ఎ 53/2
రెండో అనధికార టెస్ట్

మెల్‌బోర్న్: కేఎల్ రాహుల్ తీరు.. అదే కథ.. అదే వ్యథ అన్నట్టుగా తయారైంది. తాజాగా ఆస్ట్రేలియా-ఎతో గురువారం ఆరంభమైన రెండో అనధికార టెస్ట్‌లో మరోసారి విఫలమయ్యాడు. కానీ, రాహుల్‌తోపాటే హడావుడిగా ఇక్కడకు వచ్చిన ధ్రువ్ జురెల్ (80) అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో భారత్-ఎ 161 పరుగులకు ఆలౌటైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. పేసర్ నెసర్ (4/27) దెబ్బకు కేవలం 11 పరుగులకే నాలుగు టాపార్డర్ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్ రేసులో ఉన్న అభిమన్యు ఈశ్వరన్ (0)తోపాటు సాయి సుదర్శన్ (0)ను నెసర్ తొలి ఓవర్‌లోనే డకౌట్ చేసి గట్టి దెబ్బకొట్టాడు. ఇక రాహుల్ (4) నాలుగు బంతులే ఆడి బోలాండ్ బౌలింగ్‌లో కీపర్‌కు క్యాచిచ్చాడు. పెర్త్ టెస్ట్‌లో ఓపెనర్ స్థానం కోసం పోటీపడుతున్న రాహుల్ అవుటైన తీరు చూస్తే.. మేనేజ్‌మెంట్ మరో ప్రత్యామ్నాయాన్ని వెదకాలేమో..! కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (4) కూడా స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన జురెల్.. క్లిష్టమైన వికెట్‌పై బంతిని గమనించి ఆలస్యంగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. అతడికి దేవ్‌దత్ పడిక్కల్ (26) నుంచి కొంత సహకారం అందింది. నితీశ్ కుమార్ (16)ను వెబ్‌స్టర్ (3/19) వెనక్కిపంపాడు. జురెల్‌ను మెక్‌స్వీనీ అవుట్ చేశాడు. అనంతరం వర్షం కారణంగా తొలి రోజు ఆటనిలిచే సమయానికి ఆసీస-ఎ తొలి ఇన్నింగ్స్‌లో 17.1 ఓవర్లలో 53/2 స్కోరు చేసింది. మెక్‌స్వీనీ (14)ని ముకేష్.. బాన్‌క్రాఫ్ట (3)ను ఖలీల్ అవుట్ చేశారు.

**క్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్**

ఇక్సాన్ (దక్షిణ కొరియా): కొరియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ కిరణ్ జార్జ్ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో మూడో సీడ్ చి యు జెన్ (చైనీస్ తైపీ)ని 21-17, 19-21, 21-17 తేడాతో ఓడించాడు.

# అర్జున్ @ 2



చెన్నై: సంచలన ప్రదర్శనతో అదరగొడుతున్న తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి ప్రపంచ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీ మూడో రౌండ్‌లో అలెక్స్ సరీనా (సెర్బియా)పై అర్జున్ గెలిచాడు. తెల్ల పావులతో ఆడిన ఇరిగేసి 37 ఎత్తుల్లో సరీనా ఆట కట్టించాడు. ఈ విజయంతో అర్జున్ 2805.8 లైవ్ రేటింగ్‌తో వరల్డ్ నెం:1 మాగ్నస్ కార్ల్‌సన్ (2831) తర్వాతి స్థానం లో నిలిచాడు. కాగా, చాలెంజర్స్ టోర్నీ మూడో రౌండ్‌లో పురానిక్‌తో గేమ్‌ను హారిక డ్రా చేసుకొంది.

హంపిక మరో డ్రా: ఫిడే మహిళల గ్రాండ్ ప్రీలో కోనేరు హంపి మరో గేమ్‌ను డ్రాగా ముగించింది. టైటి ల్ రేసు నుంచి ఇప్పటికే అవుటైన హంపి.. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో అలెగ్జాండ్రా గోర్యెంచ్ కినాతో పాయింట్ పంచుకొంది. స్టవ్‌రౌలా (గ్రీస్)తో గేమ్‌ను దివ్య డ్రాగా ముగించింది. 8 రౌండ్ల తర్వాత హంపి, దివ్య చెరి 4 పాయింట్లతో 5,6 స్థానాల్లో ఉన్నారు.

# రవూఫ్ పాంచ్ పటాకా


## ఆసీస్‌పై పాక్ ఘన విజయం

అడిలైడ్: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ తొలి వన్డేలో ఓటమిపాలైనా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ప్రఖ్యాత అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ పేసర్ హరీస్ రౌఫ్ (5/29) బంతితో నిప్పులు చెరగగా షహీన్ షా అఫ్రిది (3/26) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ 35 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌట్ అయింది. స్టీవ్ స్మిత్ (35) టాప్ స్కోరర్.

స్వల్ప లక్ష్యాన్ని పాక్ 26.3 ఓవర్లలోనే పూర్తిచేసింది. యువ ఓపెనర్ సయీమ్ అయూబ్ (82), అబ్దుల్లా షఫీక్ (64 నాటౌట్) తొలి వికెట్‌కు 137 పరుగులు జోడించి పాక్‌కు అలవోక విజయాన్ని అందించారు. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే ఆదివారం పెర్త్ వేదికగా జరుగనుంది. ఆస్ట్రేలియా గడ్డపై పాక్‌కు ఏడేండ్ల తర్వాత ఇదే తొలి విజయం కావడం విశేషం.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



# కియారా అద్వానీ హొయలు

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ కియారా అద్వానీ. ఈ భామ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో పోషిస్తున్న గేమ్‌ఛేంజర్. శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. నవంబర్ 9న లక్నోలో గేమ్ ఛేంజర్ టీజర్ గ్రాండ్‌గా లాంచ్ చేయబోతున్న విషయం తెలిసిందే. నవంబర్ 9న మూడు రాష్ట్రాలు 11 థియేటర్లలో సాయంత్రం 4:30 గంటల నుంచి సెలబ్రేషన్స్ ఉండబోతున్నాయని తెలియజేశారు. మరోసారి టీజర్ డేట్ గుర్తు చేస్తూ కియారా అద్వానీ లుక్ విడుదల చేశారు మేకర్స్. నీలం రంగు కాస్ట్యూమ్స్‌లో హొయలుపోతూ అందాలు ఆరబోస్తున్న లుక్ నెట్టింట హల్‌చల్ చేస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ చిత్రంలో రాజోలు సుందరి అంజలి మరో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, కోలీవుడ్ యాక్టర్లు ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా.. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ సమకూరుస్తున్నారు. ఈ మూవీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.





# రెండు షిఫ్ట్‌ల్లో బిజీ

ఒకప్పుడు అగ్ర కథానాయికలు రెండు, మూడు షిఫ్ట్‌ల్లో పనిచేసేవారు. తమ వల్ల సినిమా షెడ్యూల్స్‌కు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకునేవారు. ఇప్పుడు అలాంటి అంకితభావం ఉన్న నాయికలు చాలా అరుదనే చెప్పాలి. ప్రస్తుతం కన్నడ భామ రష్మిక మందన్న సైతం అదే తరహాలో రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తూ బిజీగా ఉంది. ఆమె కథానాయికగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2' డిసెంబర్ 5న విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. షూటింగ్ చివరి దశకు చేరుకోవడంతో రష్మిక మందన్న ఈ సినిమా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. అదే సమయంలో ఆమె సల్మాన్‌ఖాన్ సరసన నటిస్తున్న 'సికందర్' సినిమా షూటింగ్ సైతం ప్రస్తుతం హైదరాబాద్‌లోనే జరుగుతున్నది. ఈ సినిమాల కోసం రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్నదట రష్మిక మందన్న. 'పుష్ప' చిత్రంలో ఆమె పోషించిన శ్రీవల్లి పాత్రకు యువతరంలో మంచి క్రేజ్ దక్కింది. ఈ నేపథ్యంలో సీక్వెల్‌లో ది బెస్ట్ పర్ఫార్మెన్స్ ఇవ్వాలనే తపనతో పనిచేస్తున్నదట రష్మిక. వర్క్ విషయంలో ఆమె అంకితభావాన్ని చూసిన యూనిట్ సభ్యులు ఫిదా అవుతున్నారట. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో కుబేర, రెయిన్‌బో, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో బిజీగా ఉంది.

# ఐటెమ్ సాంగ్‌లో శ్రీలీల

## పుష్ప.2 ఇక రచ్చరచ్చే

తెలుగు ప్రజలతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటి పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్రాంచైజీ మూవీలో టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని 2024 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారని తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో స్పెషల్ సాంగ్‌కు సంబంధించిన వార్త ఒకటి బయటకు వచ్చింది. ఈ పాటలో ముందు శ్రద్ధాకపూర్‌ను అనుకోగా వర్కవుట్ కాకపోవడంతో శ్రీలీలను తీసుకున్నారని తెలిసిందే. తాజాగా శ్రీలీల సాంగ్ షూట్‌లో జాయిన్ అయిందట. రిలీజ్ డేట్‌ను దృష్టిలో పెట్టుకుని జెట్ స్పీడులో సాంగ్ చిత్రీకరిస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ పాట కోసం వారం రోజుల తీసుకోబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. గుంటూరు కారం తర్వాత చేస్తున్న రెండో పెద్ద సినిమా కావడం శ్రీలీలకు బాగా కలిసొస్తుందని అభిప్రాయపడుతున్నారు ట్రేడ్ పండితులు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే బ్యాక్ గ్రౌండ్ స్కోర్, ఆల్బమ్ అందించిన రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సీక్వెల్‌కు కూడా పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986